సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025

నేడు పాపిరెడ్డిపల్లికి వైఎస్ జగన్

- హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబానికి పరామర్శ
- ఏర్పాట్లు చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సాక్షి పుట్టపర్తి: టీడీపీ గూండాల చేతిలో ఇటీవల దారుణ హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లాకు రానున్నారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఈ ఏడాది మార్చి 30న కొందరు టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న కురుబ లింగమయ్య కుటుంబంపై దాడికి దిగారు. దాడిలో లింగమయ్య తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. నిందితులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దగ్గరి బంధువులు. అయితే మరుసటి రోజు లింగమయ్య అంత్యక్రియలకు ఎవరినీ అనుమతించకుండా పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. ఈ క్రమంలోనే బాధిత కుటుంబ సభ్యులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ నెల 8వ తేదీన పాపిరెడ్డిపల్లికి వస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగా మంగళవారం బెంగళూరు నుంచి పాపిరెడ్డిపల్లికి వస్తున్నారు. లింగమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పనున్నారు. ఆ కుటుంబానికి భరోసా కల్పించనున్నారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లను ఆయన కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురామ్ సోమవారం పరిశీలించారు.

విజయవంతం చేద్దాం

- కార్యకర్తలకు ఉషశ్రీ చరణ్ పిలుపు

పెనుకొండ రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటనను విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ గూండాల దాడిలో ఇటీవల హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైఎస్ జగన్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరు కావాలని కోరారు. ప్రతి కార్యకర్త పాల్గొని దిగ్విజయం చేయాలన్నారు.

అధికార హత్యాకాండ



- 2014–19 మధ్య టీడీపీ హయాంలో రాప్తాడులో రెండు హత్యలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య దారుణ హత్య
- పచ్చని పల్లెల్లో చిచ్చు రేపుతున్నారని ప్రజల ఆవేదన
- హత్యా రాజకీయాలను ప్రశ్నించేందుకు నేడు వైఎస్ జగన్ రాక
- అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ పోలీసులతో సర్కారు కుట్రలు



టీడీపీ గూండాల దాడిలో మృతి చెందిన కురుబ లింగమయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారంలోకి వచ్చేందుకు అలవిగాని హామీలిచ్చారు. వచ్చాక వాటిని గాలికొదిలి హత్యా రాజకీయాలు చేస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పల్లె ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరుగుతున్న హత్యా రాజకీయాలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. నేతల అక్రమాలను, అరాచకాలను ప్రశ్నిస్తే చాలు పోలీసులను అడ్డు పెట్టుకుని అక్రమ కేసులు బనాయించడం, లేదంటే దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఇంతగా దారుణాలు జరుగుతున్నా పోలీసులు నిశ్చేష్టులై చూస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. బాధితుల తరఫున చర్యలు తీసుకుంటే ఎక్కడ బదిలీ అవుతామోనన్న భయం ఖాకీలను వెంటాడుతోంది.

అప్పుడూ అంతే..

టీడీపీ అధికారంలోకి వస్తే హత్యలు కొత్త కాదని తేలిపోయింది.అందులోనూ రాప్తాడు నియోజకవర్గంలో హత్యాకాండ యథేచ్ఛగా సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2014–19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ప్రసాదరెడ్డిని, కందుకూరు శివారెడ్డిని దారుణంగా నరికి చంపారు. పరిటాల రవితోనే హత్యా రాజకీయాలు పోయాయనుకుంటే భార్య, కొడుకులతో మళ్లీ మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. 2019–24 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా చిన్నపాటి గొడవలు కూడా లేవు. పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. కానీ 2024లో కూటమి సర్కారు రాగానే.. ఒక్కసారిగా అలజడి చెలరేగింది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను దారుణంగా కొట్టి చంపారు. పరిటాల కుటుంబం కనుసన్నల్లోనే ఫ్యాక్షన్ అగ్గి మళ్లీ రాజుకుందని రాష్ట్రవ్యాప్తంగా తెలిసిపోయింది. భూకబ్జాలు, ఆక్రమణలు, అడ్డొస్తే అంతుచూడ్డాలు ఇవన్నీ ఈ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్యగా ఉమ్మడి జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

పోలీసుల దాష్టీకం

ఓవైపు రాజకీయ నేతల హత్యా రాజకీయాలు.. మరోవైపు పోలీసుల దాష్టీకం వెరసి ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతలు మృగ్యమయ్యాయి. తాజాగా కళ్యాణదుర్గం మండలం శీబావికి చెందిన రామాంజనేయులు పోలీసుల అక్రమ కేసు కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందారు. తాడిపత్రి నియోజకవర్గంలో అయితే పోలీసుల ఆగడాలకు అడ్డూ అదుపు లేదు. బాధితులపైనే రివర్స్ కేసులు పెట్టి వేధిస్తున్నారు. దీంతో చాలా చోట్ల బాధితులు కేసులు పెట్టడానికి కూడా ముందుకు రాలేని పరిస్థితి.

మారణహోమాన్ని ఆపేందుకే జగనన్న రాక

- చీమకు కూడా హాని తలపెట్టని కురుబ లింగమయ్యను హత్య చేశారు
- శాంతిస్థాపనకు జగనన్నతో కలిసి కవాతు చేద్దాం
- ప్రజలకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు



రాప్తాడురూరల్: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ సభలో పాల్గొనేందుకు రావడం లేదు. చీమకు కూడా హాని తలపెట్టని పేద రైతు కురుబ లింగమయ్యను హత్య చేస్తే ఆ కుటుంబానికి అండగా నిలవడానికి, జిల్లాలో మారణహోమాన్ని ఆపడానికి, మరో రాజకీయ హత్య జరగకూడదనే సందేశం ఇవ్వడానికి వస్తున్నారు' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లికి వస్తున్న నేపథ్యంలో సోమవారం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ వీడియో విడుదల చేశారు. వైఎస్ జగన్ మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి కుంటిమద్ది మీదుగా పాపిరెడ్డిపల్లి చేరుకుంటారన్నారు. ఇటీవల హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం మీడియాతో మాట్లాడతారని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి బెంగళూరు బయలుదేరి వెళతారని వెల్లడించారు.

ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొడదాం

జిల్లాలో ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొట్టాలనుకునే విజ్ఞులు, భవిష్యత్తు బాగుండాలని కోరుకునే యువత, రాప్తాడు నియోజకవర్గ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు మేల్కోవాలని ప్రకాష్ రెడ్డి కోరారు. కుట్ర, హత్యా రాజకీయాలు కలగలిసి ప్రభుత్వ మద్దతుతో ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 'నడుచుకుంటూ వస్తారో... సైకిల్, బైకు, ట్రాక్టర్, ఆటోల్లో వస్తారో మీ ఇష్టం. మీరు రావాలి. వస్తేనే జిల్లా నుంచి ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొట్టగలం అనే విషయం గుర్తుంచుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో శాంతి కుసుమాలు

మనందరం అభివృద్ధిని కాంక్షిస్తున్నామని, గత ఐదేళ్లు జగనన్న సంక్షేమాన్ని చూశామని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. జగనన్న హయాంలో శాంతి కుసుమాలు ఎలా వికసించాయో అందరూ చూశారన్నారు. ఒక గొడవ కాని, హత్యకాని జరగకుండా ఐదేళ్లు పరిపాలన సాగించారన్నారు. 'కూటమి' అధికారంలోకి రాగానే రాప్తాడు నియోజకవర్గంలో దౌర్జన్యాలు, దోపిడీలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి మారణకాండను ఆపుదామా.. ఆపుదామంటే అందరూ వచ్చి జగనన్నకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. 'ఎవరో కాకమ్మ కథలు చెబుతుంటారు, కుట్రలతో సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని, 'పచ్చ' మీడియాను ఉపయోగించుకుని జగన్‌మోహన్‌రెడ్డిపైనా, నాపైనా దుష్ప్రచారం చేస్తుంటారు. కానీ ఇక్కడ బతకాల్సింది నువ్వు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడుకోవాల్సింది నువ్వు. అది నీ బాధ్యత. ఆ బాధ్యతను నిలబెట్టుకోవడానికి మంగళవారం ఉదయం 9 గంటలకు కుంటిమద్ది గ్రామానికి రావాలి' అని ఆయన పేర్కొన్నారు. శాంతి స్థాపనకు జగనన్నతో కలిసి కవాతు చేద్దామన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలు, దుర్మార్గాలను జిల్లా ఓర్చదనే సందేశం ఇద్దామని, జిల్లాను కాపాడుకుందామని విజ్ఞప్తి చేశారు.

హంతకులకు శిక్ష పడేలా చూడండి

- హత్యలో పాల్గొన్న వారందరి పేర్లు చేర్చాలి
- ఎస్పీ రత్నను కోరిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- బాధిత కుటుంబంతో కలిసి వెళ్లి హత్య ఘటన వివరించిన వైనం



ఎస్పీని కలసిన అనంతరం కార్యకర్తలతో ఉష శ్రీ చరణ్

పెనుకొండ రూరల్: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య హత్య కేసులో పాల్గొన్న అందరి పేర్లు కేసులో నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె లింగమయ్య కుటుంబీకులతో కలిసి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రత్నను కలిశారు. ఈ సందర్భంగా లింగమయ్య కుటుంబీకులు హత్యకు దారితీసిన ఘటనల గురించి ఎస్పీకి వివరించారు. ఆరోజు జరిగిన హత్యాకాండలో చాలామంది పాల్గొన్నారని, పోలీసులు మాత్రం ఇద్దరిపైనే కేసు నమోదు చేశారని ఎస్పీకి తెలిపారు. పోలీసులు కావాలనే పలువురి పేర్లు ఎఫ్ఐఆర్ నుంచి తొలగించారని ఉషశ్రీచరణ్ ఫిర్యాదు చేశారు. మరోసారి విచారించి అందరి పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఉషశ్రీ చరణ్ వెంట వైఎస్సార్ సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు సుధాకర్ రెడ్డి, గజేంద్ర తదితరులు ఉన్నారు.

నూతన జిల్లా జడ్జిగా భీమా రావు

- నెల్లూరు జిల్లా జడ్జిగా జి. శ్రీనివాస్ బదిలీ



ఈ. భీమారావు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఈ. భీమా రావు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆయనను జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జి. శ్రీనివాస్ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అలాగే, అనంతపురం నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (గుత్తి)గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిని పిఠాపురం అదనపు జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. అనంతపురం అదనపు జిల్లా జడ్జి ఎం. శోభారాణి సీబీఐ స్పెషల్ జడ్జి (కర్నూలు)గా బదిలీ అయ్యారు.

- జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన ఈ.భీమారావు 1972లో పిఠాపురంలో జన్మించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ కాకినాడలో పూర్తి చేశారు. పిఠాపురంలో న్యాయవాది వృత్తిని చేపట్టారు. 2013లో అదనపు జిల్లా జడ్జిగా విజయవాడలో బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో ఫ్యామిలీ కోర్టుకు బదిలీ అయ్యారు. అదే సంవత్సరంలోనే విజయనగరం ఫ్యామిలీ కోర్టు కమ్–నాలుగో అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. 2020లో పదోన్నతిపై పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు.
- నెల్లూరుకు బదిలీపై వెళ్తున్న జడ్జి జి. శ్రీనివాస్ అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సంచలన తీర్పులు వెలువరించారు. కందుకూరు శివారెడ్డి హత్య కేసులో నిందితులకు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష విధించారు. జిల్లా కోర్టు చరిత్రలోనే మొత్తం 12 కేసుల్లో ముద్దాయిలకు జీవిత ఖైదు విధించిన తొలి ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కావడం గమనార్హం. సివిల్ కేసులనూ 50 శాతం పరిష్కరించి కక్షిదారులకు సాంత్వన చేకూర్చారు.

మా భూములను లాక్కుంటున్నారు

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గిరిజన మహిళలు



కలెక్టరేట్ వద్ద వినతి పత్రాలతో బాధితులు

బత్తలపల్లి: ''నిరుపేదలమైన మాకు గతంలో ప్రభుత్వం భూ పంపిణీ కింద పొలాలు పంపిణీ చేసింది. వాటిని సాగుచేసుకుంటూ మా కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇప్పుడు అధికార పార్టీ అండతో కొందరు మా భూములను ఆక్రమించుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. మీరే తగు చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలి'' అని బత్తలపల్లి మండలం సూర్యచంద్రాపురం గ్రామస్తులు సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు విన్నవించారు. తమకు 2012లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి దంపెట్ల గ్రామ పొలంలోని 107 సర్వే నంబర్‌లో 11 మంది ఎరికల కులస్తులకు 2 ఎకరాలు చొప్పున పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పట్టాలు పొందిన తర్వాత తామే సాగులో ఉన్నామన్నారు. అయితే వర్షాభావం వల్ల పెట్టుబడులు రాకపోవడంతో ప్రస్తుతం పంటలు సాగు చేయలేకపోయామి, దీంతో అక్కడ కంపచెట్లు పెరిగాయన్నారు. రీ సర్వే నేపథ్యంలో భూముల్లో కంపచెట్లు తలగించుకునేందుకు సిద్ధమయ్యామన్నారు. ఇంతలోనే దంపెట్ల గ్రామానికి చెందిన హరిదాసు అనే వ్యక్తి తన తోటకు దగ్గరగా ఉన్న తమ భూముల్లో రాత్రికి రాత్రే జేసీబీతో కంపచెట్లు తొలగించి మామిడి మొక్కలు నాటుతుండగా అడ్డుపడ్డామన్నారు. దీంతో తమను కులం పేరుతో దూషించి, బెదిరించి అక్కడ నుంచి తరమి వేశారని కలెక్టర్‌కు తమ బోడు వెళ్లబోసుకున్నారు. ఆ తర్వాత తహసీల్దార్, వీఆర్‌ఓలకు ఫిర్యాదు చేయగా.. వారు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. తమ జీవనాధారమైన పొలం ఆక్రమణకు గురికాకుండా న్యాయం చేయాలని బాధితులు నాగేంద్రమ్మ, ఉమాదేవి, రామలక్ష్మి, రామాంజినమ్మ, లావణ్య, నారాయణమ్మ, లలక్ష్మీదేవి, సామ్మ, వనజ, మణెమ్మ, లక్ష్మమ్మ తదితరులు కలెక్టర్‌ను కోరారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 220 అర్జీలను అందగా...పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. అర్జీలన్నింటికీ నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలో అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్ట్‌లైన హెచ్ఎన్ఎస్ఎస్, నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే జిల్లాలో త్వరితగతిన పూర్తయ్యేలా ఎంపీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులందరూ సంబంధిత మండలాలను సందర్శించి అన్ని జీఎస్‌డబ్ల్యూఎస్ నివేదికలను పర్యవేక్షించాలన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. పీ–4 సర్వే పనులు వేగవంతంగా చేయాలని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉదయం 9 నుంచే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టరేట్‌లో వచ్చే వారం నుండీ ఉదయం 9 గంటల నుండీ మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజలు సమయ వేళలు గమనించి అందుకు తగ్గట్టుగా సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పట్టు పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జేడీ పద్మావతి, ఏపీఎం ఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్ కుమార్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి భాయి, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ..

మహిళలపై జరిగే లైంగిక వేధింపులను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన 'మహిళలపై లైంగిక వేధింపుల చట్టం–2013' వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి విభాగంలోను, ప్రతి స్థాయిలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు విచారించేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



జనజీవన రైతు ఉత్పత్తి దారులు స్టాల్స్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు అందించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కలెక్టరేట్ ఆవరణలో జనజీవన రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ప్రతి సోమవారం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్‌కు వస్తారని, ప్రకృతి వ్యవసాయంపై వారికి అవగాహన కల్పించేలా ప్రతివారం ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తగ్గిన చింతపండు ధర



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: చింతపండు ధర తగ్గుముఖం పట్టింది. నెలరోజుల క్రితం వరకూ క్వింటా రూ.33 వేలకుపైగా పలకగా, ఈవారం ఏకంగా రూ.9 వేలు పడిపోయింది. సోమవారం హిందూపురం మార్కెట్‌కు 1034.40 క్వింటాళ్ల చింత పండురాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం(ఫైన్) క్వింటా గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరిన రూ.10 వేలు పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.15 వేలు, కనిష్ఠంగా రూ.4,500, సరాసరిన రూ.7 వేల పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

ఈ–శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

ప్రశాంతి నిలయం: జిల్లాలో జొమాటో, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, బ్లూడార్ట్, ఈ కార్ట్ వంటి ఈ–కామర్స్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులంతా 'ఈ–శ్రామ్' పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ సూర్యనారాయణ సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు, కార్మికుల రిజిస్ట్రేషన్ కోసం అన్ని కార్మిక శాఖ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్లాట్‌ఫాం కార్మికులు, గిగ్ కార్మికులు సభ్యత్వం కోసం వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్మికులు ఏవైనా సందేహాలుంటే 9100825189 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రాగులకు 'మద్దతు'

- క్వింటా రూ.4,290 ప్రకారం కొనుగోళ్లు



జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: రబీ సీజన్‌లో జిల్లా రైతులు సాగుచేసిన రాగి పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటా రాగులను రూ.4,290 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే పంట కొనుగోలు చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతులకు గోనె సంచులు, లోడింగ్, రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే అందిస్తుందన్నారు.

మద్యం మత్తులో 'తమ్ముళ్ల' వీరంగం

- మహిళపై కొడవలితో దాడి



గాయపడిన భాగ్యమ్మ



భాగ్యమ్మ కుడిచేతికి రక్తపు గాయం

లేపాక్షి: మద్యం మత్తులో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఓ మహిళ చేయి నరికారు. ఈ ఘటన లేపాక్షి మండలం కోడిపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. కోడిపల్లి పంచాయతీ కొత్తపల్లి క్రాస్ వద్ద బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఇక్కడ ఆదివారం రాత్రి కోడిపల్లికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు మద్యం సేవించారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్, సుభాష్ గొడవ పడ్డారు. ఈ గొడవలో ఇద్దరూ గాయపడ్డారు. అంతటితో ఆగకుండా శ్రీకాంత్ కొందరు టీడీపీ మద్దతుదారులతో కలిసి సుభాష్ ఇంటికి వెళ్లి దాడి చేశారు. సుభాష్ తల్లి బోయ భాగ్యమ్మ కుడిచేతిని నరికారు. తీవ్ర రక్తస్రావమైన.. ఆమె కేకలు వేయడంతో దాడి చేసిన వారు పారిపోయారు. అలాగే అధికార పార్టీ నాయకుల బెదిరింపులతో సుభాష్ ఊరొదలి వెళ్లిపోయాడు. దాడిలో గాయపడిన భాగ్యమ్మకు హిందూపురం ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఇదిలావుండగా... టీడీపీ కార్యకర్తలకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు దిగి బాధితుడైన సుభాష్‌పైనేనే కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. దీనిపై ఎస్ఐ నరేంద్రను వివరణ కోరగా.. ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

భూసేకరణతో పొట్ట కొడతారా?

- తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా



భూసేకరణ చేయొద్దంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

అగళి: పరిశ్రమల ఏర్పాటుకు తమ భూములు ఇవ్వబోమని హెచ్.డి.హళ్లి పంచాయతీ గాయత్రీ కాలనీ, ఉల్లేకెర, దేవరహళ్లి, సుగాలి తండా, వడ్రహట్టి, పి.బ్యాడగేర గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఇటీవల పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి తమ భూములను కలెక్టర్ పరిశీలించారని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేందుకు తాము సుముఖంగా లేమని తేల్చి చెప్పారు. తమకున్న అరకొర భూములను పరిశ్రమల ఏర్పాటు పేరుతో ప్రభుత్వం తీసుకుంటే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అభిప్రాయానికి వ్యతిరేకంగా భూసేకరణ ప్రక్రియ చేపట్టి పొట్ట కొట్టరాదంటూ తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తహసీల్దార్ ఇచ్చిన హామీతో ఆందోళనను రైతులు విరమించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు నంబూరి ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పుట్టపర్తి రూరల్ పీఎస్ ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం రాచువారిపల్లికి చెందిన నంబూరి ప్రసాద్(45)కు భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ప్రసాద్... తనకున్న ఎనిమిది ఎకరాల్లో వరి, కళింగర, దోస పంటలను సాగు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో పంటకు నీళ్లు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో స్టార్టర్ పెట్టెలో బటన్ నొక్కినా మోటార్ ఆన్ కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కేబుల్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలంలో బోరు మోటార్ ఆన్ చేసి వస్తానంటూ వెళ్లిన వ్యక్తి ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆయన సెల్‌ఫోన్ నంబర్‌కు కాల్ చేశారు. అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ లోపు పొలం వద్ద నుంచి వచ్చిన చుట్టుపక్కల రైతులు.. నంబూరి ప్రసాద్ మృతిచెందినట్లు తెలపడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తూ పొలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చంద్రకళ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లింగమయ్యను చంపినట్లే.. నిన్నూ చంపేస్తాం!

- సామాజిక సేవా కార్యకర్తను బెదిరించిన టీడీపీ నేతలు
- ప్రాణహాని ఉందంటూ చేసిన ఫిర్యాదును నీరుగార్చిన పోలీసులు
- తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకున్న బాధిత మహిళ



ఎస్పీ రత్నకు అందజేసిన అర్జీని చూపుతున్న బాధితురాలు లక్ష్మీదేవి



అర్జీదారు సమస్యను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: 'ప్రభుత్వం మాది... ఇక్కడ మాదే రాజ్యం. పాపిరెడ్డిపల్లి లింగమయ్యను చంపేసినట్లే నిన్నూ చంపేస్తాం' అంటూ ఓ సామాజిక సేవా కార్యకర్తపై టీడీపీ నేతలు దౌర్జన్యానికి తెగబడ్డారు. మహిళ అని కూడా చూడకుండా చెప్పులతో కొట్టి అవమానపరిచి చంపుతామని బెదిరించారు. దీంతో టీడీపీ నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. న్యాయం చేయాల్సిన ఖాకీలు చేతులెత్తేశారు. కేసును నీరుగార్చి బాధితురాలి ప్రాణాలకు భరోసా లేకుండా చేశారు. దీంతో జరిగిన ఘటనను ఎస్పీ రత్న దృష్టికి బాధితురాలు, అమడగూరు మండలం మహమ్మదాబాద్‌కు చెందిన లక్ష్మీదేవి తీసుకొచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసి, తన గోడు వెల్లబోసుకున్నారు. ఫిర్యాదులో ఆమె పేర్కొన్న వివరాలు..

'మాది అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామం. నాకు, నా కుటుంబసభ్యులకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. అనాథ పిల్లలు, వృద్ధులకు సేవ చేయాలని అనుకున్నా. 2024, డిసెంబర్ 5న నా సొంత పొలంలోని 20 సెంట్ల స్థలంలో ఓ షెడ్ వేయించాలనుకున్నా. ఇందుకు గాను నాకున్న మూడు సెంట్ల స్థలాన్ని అమ్మగా వచ్చిన డబ్బుతో ఇటీవల షెడ్ వేయిస్తున్నా. నా సేవా సంకల్పాన్ని చూసి ఓర్వలేక స్థానిక టీడీపీ నాయకులు రాము, వెంకటేష్, సురేష్.. షెడ్డు కట్టకూడదని అడ్డుకున్నారు. నన్ను నోటికొచ్చినట్లు తిట్టారు. చెప్పులతో కొట్టారు. అధికారంలో ఉన్నాం... మా వెనుక మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఉన్నారు... రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో లింగమయ్యను చంపినట్లు చంపేస్తాం... ఎవరు అడ్డొస్తారో చూస్తాం అంటూ బెదిరించారు. దీంతో నాకు ప్రాణహాని ఉందని సాక్ష్యాలతో సహా అమడగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాను. అయితే పోలీసులు టీడీపీ నేతలకే వత్తాసు పలికారు. వారిపై గొడవ కేసు నమోదు చేసి, అరెస్ట్ కూడా చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. దీంతో వాళ్లు నామీద మరింత కక్ష కట్టి నన్ను భయపెడుతున్నారు. నాకు ప్రాణహాని ఉంది. న్యాయం చేయండి' అంటూ ఎస్పీ వద్ద బాధితురాలు వాపోయారు. దీనిపై స్పందించిన ఎస్పీ... నీకు ఎలాంటి హాని లేకుండా చూస్తామని, బెదిరింపులకు పాల్పడిన వారిని బైండోవర్ చేయిస్తానంటూ భరోసానిచ్చారు.

65 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 65 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని, చట్ట పరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'స్టార్' తిరగబడింది!

- తాడిపత్రిలో బోర్డు తిప్పేసిన ఫైనాన్స్ సంస్థ
- రూ.6 లక్షలతో ఉడాయించిన సంస్థ ఇన్‌చార్జ్ భాస్కర్
- సంస్థ సిబ్బందిని నిలదీస్తున్న బాధితులు
- పోలీసులను ఆశ్రయించిన సిబ్బంది, బాధితులు



ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఫైనాన్స్ సంస్థ సిబ్బంది

తాడిపత్రి టౌన్: 'బిజినెస్ చేయాలనుకున్నారా?. సొంత ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు లేక ఆగిపోయారా? ఇప్పుడు మీ కలలను సాకారం చేసేందుకు స్టార్ ఫైనాన్స్ మీ ముందుకు వచ్చింది. సిబిల్ స్కోర్ లేకున్నా మీకు రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటూ ఊరించి నెల రోజులు తిరగకుండానే బాధితులకు రూ.6 లక్షల కుచ్చుటోపీ పెట్టి తాడిపత్రిలో ఓ ఫైనాన్స్ సంస్థ బోర్డు తిప్పేసింది. వివరాలు... తాడిపత్రి మండలం కొండేపల్లికి చెందని సాగిబండ భాస్కర్... స్థానిక నంద్యాల రోడ్డులో ఓ గదిని అద్దెకు తీసుకుని స్టార్ ఫైనాన్స్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. సిబిల్ స్కోర్ లేకపోయినా వ్యక్తిగత రుణాలు, బిజినెస్ లోన్లు, హౌస్.. ప్లాట్ లోన్లు ఇస్తామంటూ ఆకర్షణీయమైన ఫ్లెక్సీల్లో విస్తృత ప్రచారం చేశాడు. నెలకు రూ.10వేల వేతనంతో దాదాపు 20 మంది సిబ్బందిని నియమించుకుని ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారిపై ఉసిగొల్పాడు. ఎదుటి వ్యక్తి అవసరాలను బట్టి రుణం మంజూరుకు సంబంధించి రూ.లక్షకు 6 శాతం చొప్పున ప్రాసెసింగ్ ఫీజును ముందుగానే రాబట్టుకున్నాడు. ఇలా దాదాపు 35 మందితో రూ.6 లక్షలు వసూలు చేసుకుని 30 రోజుల్లోపు రుణం మొత్తం వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందని నమ్మబలికాడు. దాదాపు నెల రోజలకు పైగా గడుస్తున్నా బ్యాంక్ ఖాతాలకు రుణం మొత్తం జమ కాకపోవడంతో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన పలువురు నేరుగా కార్యాలయానికి చేరుకుని అక్కడున్న సిబ్బందిని నిలదీశారు. దీంతో రేపోమాపో వస్తుందని చెబుతూ వచ్చిన సిబ్బంది సైతం ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడు భాస్కర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో లబోదిబో మంటూ బాధితులతో కలసి సోమవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌ను కలసి సమస్య విన్నవించారు. ఘటనపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

మధురం.. ప్రేమ రామం



ప్రేమ రామం నృత్య రూపకంలోని సన్నివేశాలు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తెలంగాణ సత్యసాయి యూత్ బృందం సభ్యులు సోమవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరం వేదికగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. సత్యసాయి తన భక్తులపై చూపిన ప్రేమ, వాత్సల్యాన్ని త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు తన భక్తపరివారంపై చూపిన ప్రేమ వాత్సల్యంతో పోల్చుతూ ప్రేమ రామం పేరుతో ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను మైమరిపించింది. రామకథ రసవాహిని పేరుతో సత్యసాయి రాసిన రామగ్రంథం నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నృత్య రూపకాన్ని రూపొందించడం విశేషం. అంతకు ముందు ఉదయం శ్రీ సాయి రామ నామామృతం పేరుతో సంగీత కచేరీతో అలరించారు.

వైభవంగా 'వేమన' ఉత్సవాలు



చాందినీ బండిని ఊరేగిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో రెండో రోజు సోమవారం రాత్రి విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు వైభవంగా సాగాయి. పీఠాధిపతి నంద వేమారెడ్డి ఆధ్వర్యంలో వేమన సమాధిని ప్రత్యేకంగా ఆలంకరించి విశేష పూజలు చేశారు. కదిరి పరిసర మండలాల నుంచే కాక వైఎస్సార్ జిల్లా, కర్నూలు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వేమన ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులకు పీఠాధిపతి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాటల కచేరీ అలరించింది.



ఉత్సవాలకు హాజరైన భక్తులు

వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకోం

- ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండల పర్యటనను అడ్డుకోవాలని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నిర్ణయించలేదని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మందకృష్ణ నాయకత్వంలోని ఎమ్మార్పీఎస్‌కు సంబంధం లేని వ్యక్తులు ఎవరైనా అలాంటి అడ్డుకునే ప్రకటనలు చేస్తే ఎమ్మార్పీఎస్ శ్రేణులు స్పందించాల్సిన అవసరం లేదని మందకృష్ణ మాదిగ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌కు ఎక్కడైనా పర్యటించే స్వేచ్ఛ ఉందన్నారు.

పాపిరెడ్డిపల్లికి కొందరికే అనుమతి



పాపిరెడ్డిపల్లిలో ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్న పోలీసులు

పెనుకొండ: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం ఆమె పెనుకొండలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో పాపిరెడ్డిపల్లిలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పాపిరెడ్డిపల్లి కుగ్రామం కావడం... రహదారులు చిన్నగా ఉండడంతో ఎక్కువ మంది గ్రామంలో పర్యటించేందుకు వీలు లేదన్నారు. ఈ పరిస్థితి దృష్ట్యా వైఎస్ జగన్ వెంట ఎక్కువ మందిని గ్రామంలోకి అనుమతించబోమన్నారు. పార్టీ నాయకులు పోలీసుల సూచనలు దృష్టిలో ఉంచుకొని నడుచుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రితో పాటు అనుమతి కలిగిన నాయకులను మాత్రమే గ్రామంలోకి అనుమతిస్తామని ఎస్పీ తెలిపారు.

జగన్‌ను అడ్డుకునే ధైర్యం మాకుంది

- మాలో పరిటాల, చంద్రబాబు, టీడీపీ బ్లడ్ ఉంది
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వివాదాస్పద వ్యాఖ్యలు

రాప్తాడురూరల్: 'వైఎస్ జగన్‌ను రాప్తాడు రాకుండా అడ్డుకునే దమ్ము, ధైర్యం మాకున్నాయి. మాలో పరిటాల, చంద్రబాబు, టీడీపీ బ్లడ్ ఉంది. ఆయన ఇక్కడ దిగకుండా తిరిగి పంపే శక్తి ఉంది' అంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆమె రామగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జగన్‌ను అడ్డుకుందామంటూ తమ కార్యకర్తలు, నాయకులంతా కోరుతున్నారని తెలిపారు. పర్యటనకు వచ్చే జగన్.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా బాధిత కుటుంబానికి సాయం చేయాలని సూచించారు. టీడీపీ నేతలు ఎక్కడా సంయమనం కోల్పోవద్దన్నారు.

సింహ వాహనంపై రంగనాథుడు



తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి సింహ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రంగనాథస్వామిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో అర్చకులు అలంకరించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు



పోటీలో తలపడిన క్రీడాకారులు

ధర్మవరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీలు రెండో రోజు సోమవారం హోరాహోరీగా సాగాయి. ప్రకాశం జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 3–1 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఏలూరు జట్టుపై విశాఖ జట్టు 8–1, గుంటూరు జట్టుపై అన్నమయ్య జిల్లా జట్టు 6–1, ఎన్టీఆర్ జిల్లా జట్టుపై వైఎస్సార్ జిల్లా జట్టు 7–0, ఏలూరు జట్టుపై శ్రీకాకుళం జట్టు 2–0, చిత్తూరు జిల్లా జట్టుపై కాకినాడ జట్టు 6–0, నంద్యాల జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 5–0 గోల్స్ తేడాతో గెలుపొందాయి. తిరుపతి – అనకాపల్లి, అన్నమయ్య– శ్రీకాకుళం, కాకినాడ – అనంతపురం, వైఎస్సార్ – శ్రీసత్యసాయి జిల్లా జట్ల మధ్య మంగళవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. పోటీలను హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, ట్రెజరర్ థామస్ పీటర్, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు గౌరిప్రసాద్, కోచ్ హుసేన్ పర్యవేక్షించారు.

నీలకంఠాపురంలో సామూహిక వివాహాలు



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నూతన వధూవరులు

మడకశిర రూరల్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మడకశిర మండలం నీలకంఠాపురంలో వెలిసిన నీలకంఠేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం ఉచిత సామూహిక వివాహాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్ రఘువీరారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో 18 జంటలు వేదమంత్రాల సాక్షిగా ఒక్కటయ్యాయి. అంతకు ముందు సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కర్ణాటకలోని పట్టనాయకనహళ్లి నంజావధూతస్వామి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. నూతన జంటలకు తాళిబొట్లు, నూతన వస్త్రాలు, కాలిమెట్లను నంజావధూత స్వామి, రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు అందించి ఆశీర్వదించారు. వేడుకకు హాజరైన వందలాది మందికి పెళ్లి విందు భోజనం ఏర్పాటు చేశారు. కాగా, శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సేవామందిర విద్యాసంస్థల అధినేత కేటీ శ్రీధర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ కళావతి, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం: నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న లింగమయ్య బిరియాని సెంటర్‌లో పనిచేస్తున్న షేక్ నూర్ మహమ్మద్ (43) హత్య కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్‌ను అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. లింగమయ్య బిరాయని సెంటర్‌లో పనిచేస్తున్న నూర్‌మహమ్మద్, శ్రీధర్, గణేష్ ముగ్గురూ మంచి స్నేహితులు. ఎంతో సరదాగా కలిసి మెలిసి ఉండేవారు. హోటల్‌లో పని విరామ సమయంలో కార్మికులు సేదదీరేందుకు సమీపంలోని రహమత్‌నగర్‌లో ఓ గదిని హోటల్ నిర్వాహకులు అద్దెకు తీసుకున్నారు. హోటల్ పని అయిపోయిన తర్వాత ముగ్గురు స్నేహితులు గదికి చేరుకుని మద్యం సేవించే వారు. ఈ క్రమంలో ఇప్పటికే తన భార్యతో విడాకులు తీసుకున్న శ్రీధర్ రెండో పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలుసుకున్న నూర్ మహమ్మద్ తరచూ శ్రీధర్ ఆత్మగౌరవం దెబ్బతినేలా కించపరుస్తూ మాట్లాడేవాడు. ఈ మాటలను జీర్ణించుకోలేని శ్రీధర్ కక్ష పెంచుకుని ఆదివారం రహమత్ నగర్‌లోని గదిలో నిద్రిస్తున్న నూర్‌మహమ్మద్ తలపై నల్లబండరాయితో దాడి చేసి, హతమార్చాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పక్కా ఆధారాలతో సోమవారం ఉదయం ప్రకాష్‌రోడ్డులో తచ్చాడుతున్న నిందితుడు శ్రీధర్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పేదోడి రైలు.. రైల్వేకు అలుసు

పేద, మధ్య తరగతి ప్రయాణికులకు అనుగుణంగా మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ (ఎంఎంటీఎస్ – డెమో ప్యాసింజర్) రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రవేశపెట్టింది. వీటితో తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అయితే డెమో రైళ్లలో ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- డెమో ప్యాసింజర్ రైళ్లతో ప్రయాణికుల బేజారు
- మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు
- జనరల్ బోగీలతో నడపాలని ప్రయాణికుల డిమాండ్



డెమో రైలులో ప్రయాణిస్తున్న దృశ్యం

గుంతకల్లు: డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న డెమో ప్యాసింజర్ రైళ్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుంతకల్లు–హిందూపురం (77213/14), గుంతకల్లు–రాయచూర్ (77201/02), గుంతకల్లు–డోన్ (77203/04), డోన్–గుత్తి (77205/06), నంద్యాల–రేణిగుంట (77212/11), కర్నూలు సిటీ–నంద్యాల (77209/10) మధ్య నడుస్తున్న డెమో ప్యాసింజర్ రైళ్లలో రాయలసీమ జిల్లా వాసులు తక్కువ ధరతో ప్రయాణం చేయడానికి ఎంతో అనువుగా ఉన్నాయి. దీంతో మధ్య తరగతి, గ్రామీణ ప్రాంతా ప్రయాణికులు ఈ రైళ్ల వైపు మొగ్గు చూపారు. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

వసతులు కరువు..

హైదరాబాదు, బెంగుళూరు తదితర నగరాల్లో నడుస్తున్న ఎంఎంటీఎస్ రైళ్ల (డెమో)ను రైల్వేశాఖ సాధారణ ప్రయాణికుల కోసం గుంతకల్లు డివిజన్ లోపి పలు ప్రాంతాల నుంచి నడుపుతోంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకపోవడంతో పాటు సమయానికి నిర్దేశించిన గమ్యస్థానానికి చేరుకోవచ్చు. దీంతో సిటీ ప్రజలు ఎక్కువగా ఈ రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్ వెళ్లడానికి 5 నిమిషాల సమయం కూడ పట్టదు. 700ల మంది కూర్చొని, మరో వెయ్యి మందికి పైగా నిల్చొని ప్రయాణం చేసే వెసులుబాటు ఉంది. దీంతో ఈ రైళ్లలోని బోగీల్లో టాయిలెట్లు, నీటి వసతి అనేవి ఉండవు. గుంతకల్లు–హిందూపురం మధ్య నడుస్తున్న డెమో ప్యాసింజర్ రైలు దాదాపు 200 కి.మీ.లు ప్రయాణించాల్సి ఉంది. గుంతకల్లు నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరిన రైలు హిందూపురానికి రాత్రి 10 గంటలకు చేరుకుంటుంది. ఈ క్రమంలో ప్రయాణికులు టాయిలెట్‌కు వెళ్లాలంటే వీలుపడదు. బోగీల్లో టాయిలెట్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి వృద్ధులు, మహిళలు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌లో నిలబడిన వెంటనే రైలు దిగి టాయిలెట్ల వైపు పరుగు తీస్తున్నారు. ఈ లోపు రైలు వెళ్లిపోవడంతో సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైలు మిస్ అయిన ప్రయాణికులు స్టేషన్ మాస్టర్లతో గొడవకు దిగిన సందర్భాలు చాలా ఉన్నాయి.

ప్యాసింజర్లు అంటే చులకన...

పేదోడి రైళ్లు (ప్యాసింజర్) అంటే రైల్వేశాఖకు చులకనైపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడ్స్ రైళ్లపై ఉన్న శ్రద్ధ ప్యాసింజర్ రైళ్లపై లేదని విమర్శిస్తున్నారు. గుంతకల్లు–గుత్తి, గుత్తి–ధర్మవరం మధ్య డబుల్‌లైన్ పూర్తయింది. ఈ మార్గంలో ఒకేసారి రెండు రైళ్ల పరుగులు పెడుతాయి. అయితే గూడ్స్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరుగులు పెడుతున్న సమయంలో డెమో రైళ్లను ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేస్తున్నారు. దీంతో ఈ రైళ్లు సరైన సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి ఎండలకు రైళ్లలో ఉక్కపోతకు చిన్నారులు, వృద్ధులు తాళలేకపోతున్నారు.

సాధారణ బోగీలతో నడపాలి



డివిజన్ వ్యాప్తంగా నడుపుతున్న డెమో రైళ్ల స్థానంలో సాధారణ బోగీలతో ఉన్న ప్యాసింజర్ రైళ్లను నడపాలి. ఈ సాధారణ బోగీల్లో టాయిలెట్లు, నీటి సౌకర్యం ఉంటుంది. డెమో రైళ్లతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను రైల్వేశాఖ గుర్తించాలి. డెమో రైళ్లను సిటీలకే పరిమితం చేయాలి.

– అనంత శేషారెడ్డి, గుంతకల్లు